
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
సోమవారం 29 జనవరి 2024




మల్లన్నకు హారతినిస్తున్న వీరశైవార్చకులు


రాజగోపుర ప్రాంగణంలో భక్తజనసందోహం

బోనమెత్తిన లష్కర్

7లో..



● కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు ● పోటెత్తిన భక్తులు

సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీ

గజ్వేల్, జనవరి 28: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ తరుణ్‌జోషి ఉత్తర్వులు వెలువరించారు.

తొగుట సీఐ కమలాకర్ స్థానంలో ఎస్‌కే.లతీఫ్‌ను బదిలీ చేశారు. కమలాకర్‌ను మల్టీజోన్-1 ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వులిచ్చారు. కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలో సీసీఎస్‌లో పనిచేస్తున్న ముత్యంరాజును సీఎస్‌బీ-1 సిద్దిపేటకు బదిలీ చేయగా, సీఎస్‌బీ-1గా పనిచేస్తున్న ఎల్.రఘును మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. దర్పల్లి సీఐగా పనిచేస్తున్న బి.సైదాను గజ్వేల్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. గజ్వేల్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న అవిరెడ్డి జాన్‌రెడ్డిని మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాన్సువాడ టౌన్‌లో పనిచేస్తున్న మహేందర్‌రెడ్డిని గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐగా, గజ్వేల్ రూరల్ సర్కిల్‌లో పనిచేస్తున్న జానకిరాంరెడ్డిని టాస్క్‌ఫోర్స్-1గా బదిలీ చేశారు. మల్టీజోన్-1లో వెయిటింగ్‌లో ఉన్న ఉపేందర్‌ను టూ టౌన్ సీఐగా, సీహెచ్ విద్యాసాగర్‌ను త్రీటౌన్ సీఐగా బదిలీ చేశారు. ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న వి.శ్రీనివాస్ దుబ్బాక సీఐగా, దుబ్బాక సీఐగా పనిచేస్తున్న మున్నూరు కృష్ణను ఐజీపీ మల్టీజోన్-1లో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులో పేర్కొన్నారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఎల్.శ్రీనును చేర్యాల సీఐగా బదిలీ చేశారు. చేర్యాల సీఐగా ఉన్న సత్యనారాయణరెడ్డిని మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రైల్వేస్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీనును సిద్దిపేటరూరల్ సీఐగా, రూరల్ సీఐగా పనిచేస్తున్న చేరాలును మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేషన్ 'ఈ కేవైసీకి' మరో నెల


సిద్దిపేటలోని రేషన్ షాప్‌లో ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

● ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు
● జిల్లాలో రేషన్‌కార్డులు 2,91,444
● ఇంకా ఈ-కేవైసీ చేసుకోని వారు 2.39 లక్షల మంది
● ఆధార్ అప్‌డేట్‌తో ఆలస్యం!!

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 28: రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో పారదర్శకత పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రేషన్‌దుకాణాల్లో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) నమోదు ప్రక్రియను ప్రారంభించింది. రేషన్‌కార్డుల్లోని కుటుంబసభ్యుల వివరాలను ఈ-కేవైసీ ద్వారా అనుసంధానం చేసుకోవాలి. ఇప్పటికే రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న కుటుంసభ్యుల నుంచి బయోమెట్రిక్ ద్వారా ఈ కేవైసీ చేస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో 2,39,415 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకోలేదు. పౌర సరఫరాల శాఖాధికారుల లెక్కల ప్రకారం.. జిల్లాలో 73.24 శాతం ఈ-కేవైసీ పూర్తయింది. జనవరి 31 వరకు గడువు ఉండగా, చాలా మంది కే-వైసీ చేసుకోకపోవడంతో ప్రభుత్వం మరోసారి ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు పెంచింది.


ఆధార్ అప్‌డేట్‌తో ఇబ్బందులు

రేషన్ బియ్యాన్ని పొందాలంటే కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వెళ్లాల్సి ఉంటుంది. అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి ఈ-కేవైసీ సేకరిస్తోంది. ఈమేరకు ఆధార్ అప్‌డేట్ ఇబ్బందిగా మారింది. రేషన్ కార్డు, ఈ-కేవైసీ పూర్తి కావాలంటే ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో మీ సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కొందరి వేలిముద్రలు రాకపోవడం, ఐరిస్ తదితర వివరాలు నమోదు లేకపోవడం, పుట్టిన తేదీలు, చిరునామాల మార్పులు, ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ అప్‌డేట్‌తో కూడా ఈ-కేవైసీ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది.

వలస వెళ్లిన వారు ఈ కేవైసీకి దూరం!

ఈ-కేవైసీకి సేకరణ ఏడాది నుంచి ప్రారంభించారు. లబ్ధిదారులు పోటెత్తడంతో గడువు విధించలేదు. ఆ తర్వాత జనవరి 31తో ముగుస్తుందని ప్రకటించారు. గడువు లోగా కూడా ఎక్కువ కేవైసీ చేసుకోకపోవడంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు పెంచారు. నెలాఖరులో రేషన్ దుకాణాలు మూసి ఉండటంతో అప్‌డేట్ చేసుకునే అవకాశం లేకుండాపోయింది. ప్రధానంగా బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు పోయిన వారు ఈ విధానాన్ని పూర్తి చేసుకోలేకపోతున్నారు.





ఈ-కేవైసీ నమోదు ఇలా

జిల్లాలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబ యజమానితో పాటు కార్డులో ఉన్న సభ్యులందరూ తమకు సమీపంలోని రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈ-పాస్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయడంతోనే రేషన్ కార్డు నంబరుతోపాటు సభ్యుల ఆధార్ నంబరు చూపిస్తుంది. వాటిని సరిచూసిన తరువాత ఆకుపచ్చ రంగు లైట్ వచ్చి సభ్యుల కేవైసీ పునరుద్ధరణ పూర్తవుతుంది. ఈ-పాస్ యంత్రంలో ఎరుపు రంగు లైట్ వెలిగితే రేషన్ కార్డు, ఆధార్ సరిగా పోల్చుకోలేక పోవడంతో రిజెక్ట్ అయినట్లు చూపిస్తుంది.

73.24 శాతం పూర్తి

జిల్లాలో 2,91,444 రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారులు 8,94,586 మంది ఉన్నారు. 6,55,171 మంది ఈ-కేవైసీ చేసుకున్నారు. జిల్లాలో 73.24శాతం ఈ-కేవైసీ పూర్తయింది.


గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ పునరావాస కాలనీ

విభజనతోనే వికేంద్రీకరణ

● గజ్వేల్‌లో పౌరసేవలకు ఇబ్బందులు
● అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి
● పోలీసులకు సమస్యగా మారిన గజ్వేల్
● గతంలోనే రూరల్ స్టేషన్‌కు ప్రతిపాదనలు
● అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేస్తే చేరువకానున్న పాలన

7లో..


కోహెడ మండలం శనిగరం రహదారి పనుల ఆలస్యంపై అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీ బండి సంజయ్

రాష్ట్రానికి 'సీఆర్ఐఎఫ్' కింద రూ.600 కోట్లు విడుదల

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
● పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

కోహెడ, జనవరి 28: తెలంగాణ రాష్ట్రానికి సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.600 కోట్లు మంజూరయ్యాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం కోహెడ మండలంలో ఈ పథకం కింద చేపట్టిన కోహెడ శనిగరం గుండారెడ్డిపల్లి బస్వాపూర్ రహదారి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రహదారి నిర్మాణ పనులను రూ.212 కోట్లతో చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఈ పనులు ఇప్పటికే పూర్తికావాలన్నారు. కోహెడ మండలంలో జరుగుతున్న పనులకు నిధులు మంజూరైనా ఎందుకు సకాలంలో పూర్తి చేయలేదని కాంట్రాక్టర్‌పై ఆయ న ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరం కాలంగా నిధులు రావడంలేదని కాంట్రాక్టర్ ఎంపీకి చెప్పడంతో కేంద్రం నుంచి నిధులు వచ్చాయి కదా.. చేసిన పనులకు బిల్లులు చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన చెప్పారు. ఒక ఎంపీ ఉన్నడని, ఏనాడైనా మిమ్మల్ని ఇబ్బంది పెట్టానా..? నిధులు రావడం లేదని నాకు ఎందుకు చెప్పలేదు? ఏ రోజైనా దీనిపై నన్ను కలిశారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి కొమ్ముకాశారని ఫలితంగా పనులు నిలిచిపోయాయని పరోక్షంగా ఆరోపించారు. అనంతరం గుండారెడ్డిపల్లిలో మల్లికార్జునస్వామిని, ముత్తన్నపేటలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. బస్వాపూర్ మోయతుమ్మెద వాగుపై నేషనల్ హైవే రోడ్డు బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, గంగ్ర నళిని, బీజేపీ కోహెడ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, పలు గ్రామాల బీజేపీ శ్రేణులు ఉన్నారు.


గుండారెడ్డిపల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేసిన ఎంపీ బండి సంజయ్

గోదా రంగనాథ కల్యాణంలో మంత్రి దామోదర్

● రంగనాథ ఆలయానికి రూ. 15 లక్షలు విరాళం, మల్లన్న గుడిలో నిర్మాణాలకు రూ. 2.50 కోట్ల నిధులు


రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర్

జోగిపేట, జనవరి 28: గోదా రంగనాథ కల్యాణ మహోత్సవంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. అందోలు పట్టణంలోని చారిత్రక భూనీలా సమేత రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా గోదా కల్యాణం నిర్వహించారు. ఉత్సవాల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంగనాథ స్వామివారి రథం పునరుద్ధరణకు రూ. 15 లక్షలు విరాళం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో రూ. 2 లక్షలను ఆలయ బాధ్యులకు అందజేశారు. అనంతరం, జోగిపేట పట్టణంలో గొల్ల కుర్మల ఆరాధ్య దైవమైన మల్లన్న స్వామి సట్టి ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. పట్టణంలోని మల్లన్నగండి ప్రాంతంలో ఉన్న మల్లన్న ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగిపేటలోని మల్లన్న ఆలయంలో ప్రహరీ, అంతరాలయం, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ. 2.50 కోట్ల నిధులను మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఆయనవెంట మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్యయాదవ్, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, రేఖా ప్రవీణ్, శంకర్, హరికృష్ణాగౌడ్, రంగ సురేశ్‌గుప్తా, మహేశ్‌యాదవ్, చందుయాదవ్, మాసగోని మల్లేశం, లక్ష్మణ్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులన్నీ వెనక్కి

● కాంగ్రెస్ రాగానే విద్యుత్ కోతలు
● మెదక్ పార్లమెంట్ స్థానంలో విజయం మనదే
● బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్, జనవరి 28: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులన్నీ ప్రస్తుతం వెనక్కి వెళ్లిపోతున్నాయని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ఏడుపాయల వనదుర్గా ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు, మెదక్ పట్టణ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 కోట్ల నిధులు కేటాయించగా, ప్రస్తుతం ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లాయని వాపోయారు. నిరంతర కరెంటు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం 14 గంటలకే విద్యుత్ సరఫరాను పరిమితం చేసిందని ఆరోపించారు. దళితబంధు లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు జమచేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఖాతాలను సీజ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ షోషల్ మీడియాలో రీల్స్ చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ చేయకుండా పార్లమెంటు ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు ఎవరు ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. గతంలో తాను మంజూరు చేసిన మెడికల్ కళాశాల తరగతులను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని సూచించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా పార్లమెంటు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, ఎంపీపీలు జమునాజయరాంరెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, విశ్వం, నాయకులు గంగాధర్, లింగారెడ్డి, సిద్ధిరాములు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పంట రక్షణకు రైతుల పాట్లు!


చిన్నకోడూరు మండలం విఠలాపూర్ శివారులో మిరప చేను చుట్టూ కట్టిన చీరలు

చిన్నకోడూరు, జనవరి 28 : అడవి పందులు, కోతులు, పక్షులు పంటలను ధ్వంసం చేస్తుండడంతో వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు నానా పాట్లు పడుతున్నారు. మొక్కజొన్న, మిరప తదితర పంటలను కాపాడుకునేందుకు రైతులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అడవి జంతువులు, కోతులు, పక్షులు పంటలను ధ్వంసం చేస్తుండటంతో పంట చేల చుట్టూ పాత చీరలు కడుతున్నారు. మరికొంత మంది రైతులు చీరలతో పాటు, చేల చుట్టూ సన్నని (ఇనుప) తీగను కడుతున్నారు. రాత్రివేళల్లో జంతువులు తీగను తాకి జంకుతాయని రైతులు చెబుతున్నారు. ఇంకొందరు ఖాళీ మద్యం సీసాలను పొలాలకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలకు కడుతున్నారు. గాలికి సీసాలు చేసే చప్పుడుకు పక్షులు, జంతువులు బెదురుతాయని తెలిపారు.


మాచాపూర్ శివారులో మొక్కజొన్న చేను చుట్టూ కట్టిన చీరలు


విఠలాపూర్ శివారులో మొక్కజొన్న చేను చుట్టూ కట్టిన చీరలు, సన్నని తీగ

గజ్వేల్ రైల్వే స్టేషన్‌కు 1,327 టన్నుల యూరియా

గజ్వేల్ రూరల్, జనవరి 28: తమిళనాడులోని కరేకల్ పోర్టు నుంచి ఆదివారం గూడ్స్ ట్రైన్ ద్వారా కోరమండల్ కంపెనీ గోదావరి యూరియా 21 బోగీలలో 1,330 టన్నులు గజ్వేల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది. లారీల ద్వారా సిద్దిపేట జిల్లాలోని ఆయా మండలాలకు సంబంధించిన డీలర్లకు 1,107 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 120 టన్నులు, మెదక్ జిల్లాకు 100 టన్నుల యూరియా సరఫరా చేసేందుకు ఏర్పాట్లను మండల వ్యవసాయ అధికారి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గజ్వేల్ రైల్వేస్టేషన్‌లో రేక్ పాయింట్ ఏర్పాటుతో జిల్లా ప్రజలతో పాటు సమీప జిల్లావాసులకు ఇతర రాష్ట్రాల నుంచి సరుకు రవాణా సౌకర్యం సులభతరమైంది.



గజ్వేల్ రైల్వే స్టేషన్ నుంచి లారీల్లో తరలిస్తున్న యూరియా



భక్తజనసందోహంతో కిక్కిరిసిన మల్లన్న ఆలయ రాజగోపుర పరిసరాలు, బోనంతో సిగమూగుతున్న శివసత్తులు



బోనం తీసుకువెళుతున్న భక్తురాలు

బోనమెత్తిన లష్కర్

● కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు ● భక్తులతో పోటెత్తిన ఆలయం

చేర్యాల, జనవరి 28 : కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండో వారమైన ఆదివారం రోజున సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించుకుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టికుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోర్కెలు నెరవేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఒడిబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడుకున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మ దేవతకు బోనం చేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గంటల తరబడిగా పడిగాపులు కాయాల్సి వచ్చింది. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డిల పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనం పూదించి పూజలు చేస్తున్న భక్తురాలు



వీరకోలతో సిగమూగుతున్న ఆచారవతుడు





మల్లన్న దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు, నజరుపట్నం వేస్తున్న భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

ప్రసాదాలు, కండువాల కోసం
పునరుద్ధరణ కమిటీ సభ్యుల వాగ్వాదం

● అనవసరంగా ఇవ్వొద్దని చైర్మన్ ఆదేశం
● లష్కర్‌వారమూ భక్తులకు తప్పని తిప్పలు



వెనక దారి గుండా దర్శనం కోసం వెళ్లడానికి నిలబడిన భక్తులు

చేర్యాల, జనవరి 28 : కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీలో పలువురు సభ్యులు భక్తుల తిప్పలు పట్టించుకోకుండా తమ అనుయాయుల ఉచిత సేవలో తరిస్తున్నారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో ఇబ్బందులు పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ బుకింగ్ కార్యాలయానికి పరిమితమై ఉచిత దర్శనాలు చేయిస్తూ, ఇష్టానుసారం శల్లాలు వినియోగిస్తూ, ప్రసాదాలు ఇప్పిస్తున్నారు. చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఎవరికి ఇష్టానుసారం ప్రసాదం ఇవ్వవద్దని సంబంధిత ఇన్‌చార్జికి చెప్పినప్పటికీ పలువురు వినకపోవడంతో వివాదానికి దారితీసింది. వెనకదారిగుండా దర్శనాలు నిలిపివేసినప్పటికీ లష్కర్‌వారం సందర్భంగా ఆదివారం ఓ సభ్యుడు తన అనుయాయులందరినీ తీసుకువెళ్లగా, మరో సభ్యుడు లడ్డూ ప్రసాదం ఇచ్చినా పులిహోర కూడా ఇవ్వాలని ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి స్పందించి అనవసరంగా ఎవరికీ ఇవ్వవద్దని ఇన్‌చార్జికి సూచించారు.

నిత్యం పప్పు.. వంకాయకూరే దిక్కు!

లష్కర్‌వారం సందర్భంగా నిత్యాన్నదానసత్రంలో భక్తులకు భోజనం నిలిపివేసి ఆలయ ఉద్యోగులు, ఇతర ప్రముఖులు, వలంటీర్లు, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని మాత్రమే అనుమతిస్తున్నారు. అయితే సత్రంలో కేవలం పప్పు, వంకాయ కూరను మాత్రమే రోజుల తరబడిగా పెడుతున్నారు. కాగా కొంతకాలంగా అన్నదానసత్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కల్యాణం రోజుతోపాటు శనివారం ఉడికీ ఉడకని భోజనం వడ్డించగా, పలువురు తినకుండా పారబోశారు.

భక్తుల దాహం దాహం

లష్కర్‌వారమూ మల్లన్న భక్తులకు ఏమాత్రం తిప్పలు తప్పలేదు. రద్దీ కారణంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక ఇబ్బందులుపడ్డారు. 24 గంటల పాటు తాగునీటి సరఫరా చేస్తున్నామని చెప్పిన మిషన్ భగీరథ అధికారులు ఆలయ పరిసరాలలోని నల్లాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాకపోవడంతో నీటిని కొని తెచ్చుకున్నారు. దర్శన క్యూలైన్ల ఆవరణలో భక్తులు దాహంతో ఇబ్బందిపడ్డారు. వాటర్ బాటిళ్లు కొనుక్కుని దాహార్తి తీర్చుకున్నారు. గతంలో ఆలయం తరఫున కనీసం వాటర్‌ప్యాకెట్లు అందించేవారు. కానీ ప్రస్తుతం ఎలాంటి ప్రత్యామ్నాయచర్యలు తీసుకోలేదు.

అభివృద్ధిని అడ్డుకోవడం లేదు..
చైర్మన్ అవినీతిపైనే పోరాటం

● తూప్రాన్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా?
● వైస్ చైర్మన్, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు

తూప్రాన్, జనవరి 28: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ అవినీతిపై పోరాటం చేస్తున్నట్లు తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకోవడం లేదని, చైర్మన్ అవినీతిని అడ్డుకోడానికి ఒక్కటైనట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో కలిసి వైస్ చైర్మన్ విలేకర్లతో మాట్లాడారు. తూప్రాన్‌లో అభివృద్ధి ఆగుతుందని కాదని, అవినీతి ఆగుతుందని చైర్మన్ భయపడుతున్నట్లు ఆరోపించారు. నాలుగేళ్ల సంపాదించుకున్నది సరిపోవడంలేదని ఇంకా దోచుకోడానికి ప్రయత్నాలు సాగిస్తున్నట్లు వివరించారు. చైర్మన్‌కు వంతపాడే వాళ్లకు అర్థం కావాలని, తూప్రాన్ చౌరస్తాలో చర్చిద్దామని సవాల్ విసిరారు. పది మంది కౌన్సిలర్లం వస్తామని, మీవెంట ఉన్న ఐదారుగురిని చర్చకు తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ పెద్దలు ఈ విషయాలను గ్రహించాలని కోరారు. చైర్మన్‌ను గద్దెదించే వరకు పట్టుదలగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

కబ్జాలు చేసేందుకు కాంగ్రెస్‌లోకి రావొద్దు

● మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి


తూప్రాన్, జనవరి 28: కబ్జాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీలో రావొద్దని, పేద ప్రజలకు సేవ చేసేందుకు రావాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ మండలం నాగులపల్లిలో ఆదివారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కావేరిగారి భగవాన్‌రెడ్డి మరికొందరు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో నర్సారెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ తూప్రాన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎఫ్‌టీఎల్ భూములు, ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు ఆక్రమించారని ఆరోపించారు. అక్రమాలు, దుర్మార్గాలు తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానంటూ ప్రజలకు, బాధితులకు సూచించారు. వారం పదిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి వెలుతున్నారని, తూప్రాన్ వద్ద భారీ ఎత్తున స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. నాగులపల్లి బీఆర్ఎస్ వార్డు సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్ధిరాంరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వట్టూరులో సర్పంచు జానమ్మ మరికొందరు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్ రెడ్డి, నేత మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్‌యాదవ్, ఆకుల రవి, శశిభూషణ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

● సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులది : రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జనవరి 28: దేశాభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడే బీజేపీ రెండుసార్లు అధికారం చేపట్టి ముచ్చటగా.. హ్యాట్రిక్ విజయంతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమని దుబ్బాక బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. తపస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుడు రాగి రాములు స్వచ్ఛంద పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దాలన్నారు. మన సిద్ధంతాలు వేరైన చివరి లక్ష్యం దేశ భవిష్యత్తు మాత్రమే కావాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యమ నేతలు పక్కకుపోయి, రాష్ట్ర ప్రజలను పట్టించుకోకుండా దోచుకోవడం.. దాచుకోవడం చేసిన కేసీఆర్‌కు గత ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. పార్టీ సిద్ధంతాలు, దేశాభివృద్ధికి పాటుపడుతున్న వారికి తప్పకుండా అవకాశం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బీజేపీలో చేరిన రాగి రాములకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, నవాత్ సురేస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు రామారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలతో తమ్ముడిని హత్య చేసిన అన్న



అంజనేయులు మృతదేహం

సదాశివపేట, జనవరి 28: భూ తగాదాలతో అన్న తన సొంత తమ్ముడిని దారుణంగా నరికి చంపిన ఘటన శనివారం అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కంబాపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కంబాపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి అంజనేయులు (36), కుమ్మరి ప్రభాకర్ అన్నదమ్ములు. కొంతకాలంగా ఇద్దరి మధ్య భూ పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య శనివారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన ప్రభాకర్ తమ్ముడు అంజనేయులును కళ్లల్లో కారం చల్లి గొడ్డలితో నరికి చంపాడు. ఈక్రమంలో అడ్డుగా వచ్చిన తండ్రి చంద్రయ్యపై సైతం దాడి చేశాడు. గ్రామస్థులు సమాచారం అందజేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలియజేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

విభజనతోనే వికేంద్రీకరణ

● గజ్వేల్‌లో పౌరసేవలకు ఇబ్బందులు
● అధికారులపై పెరుగుతున్న ఒత్తిడి
● పోలీసులకు సమస్యగా మారిన గజ్వేల్
● గతంలోనే రూరల్ స్టేషన్‌కు ప్రతిపాదనలు
● అర్బన్, రూరల్ మండలాలను ఏర్పాటు చేస్తే చేరువకానున్న పాలన



గజ్వేల్ పట్టణ వ్యూ

గజ్వేల్, జనవరి 28 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలు, డివిజన్లు, మండలాలను పునర్విభజన చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తన సొంత నియోజకవర్గంలో మండల కేంద్రం విభజనపై మాత్రం చొరవ చూపకపోవడంతో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చివరి నిమిషంలో కుకునూర్‌పల్లిని మండలంగా ఏర్పాటు చేసినా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామాన్ని కుకునూర్‌పల్లిలో కలపలేదు. ఇక 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా దౌల్తాబాద్ మండలంలో ఉన్న ఆరేపల్లి(ఎస్.బీ)ని గజ్వేల్ మండలంలో కలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీతో పాటు 26 గ్రామాల మండలం ఏర్పాటైంది. అదనంగా తొగుట మండలంలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు గజ్వేల్ పట్టణంలో చేరడంతో పట్టణ జనాభా భారీగా పెరిగిపోయింది. వారికి పౌరసేవలు అందించడంలో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ అధికారులపై పెరిగిన ఒత్తిడి

గజ్వేల్ పట్టణం విస్తరించడం, భూముల విలువ అమాంతం పెరిగిపోవడం, వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. పునరావాస కాలనీ పనులను చూసేందుకు ఇద్దరు అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమవుతుండడంతో ఇటు మండలం, ఇటు పట్టణ ప్రజలకు అందాల్సిన ఆయా రకాల ధ్రువపత్రాలను అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక ప్రభుత్వ భూములను కాపాడడం కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతానికి రెవెన్యూ అధికారులకు అండగా ఉన్న వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసి ఇతరశాఖల్లో సర్దుబాటు చేస్తే ప్రభుత్వ భూములను కాపాడడం కష్టతరమేనని అధికారులు వాపోతున్నారు. పట్టణంతో పాటు మండలంలోని 26గ్రామాల ప్రజలకు అందాల్సిన పౌరసేవలు సరైన సమయానికి అందడం లేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన స్థాయిలో సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. ప్రత్యేక రెవెన్యూ మండలంగా విభజిస్తేనే సమస్యకు పరిష్కారం లభ్యమవుతుందని అధికారుల ద్వారా వినవస్తుంది.

పోలీసులకు ఇబ్బందులు

గజ్వేల్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తుండడం, కొత్తగా బైపాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు రావడం, త్వరలోనే రైల్వేలైన్ అందుబాటులోకి వస్తుండడం, మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు ఇలా భారీగా జనాభా పెరిగిపోవడంతో పోలీసులకు పనిభారం ఎక్కువైంది. పట్టణంతో పాటు మండలాన్ని పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. గజ్వేల్ రూరల్, గజ్వేల్ అర్బన్‌గా విభజిస్తేనే సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు వచ్చి చేరడం, సిబ్బంది, అధికారుల నియామకం జరగకపోవడంతో ఉన్న సిబ్బందే కష్టపడాల్సి వస్తుంది. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సీఐలు ఉండగా, నలుగురు ఎస్ఐలకు ముగ్గురు, ఆరుగురు ఏఎస్ఐలకు నలుగురు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 70మంది కానిస్టేబుళ్లకు 50మందే ఉన్నారు. ఉన్న వారిలో పలువరు డిప్యూటేషన్ ఇతర వింగ్‌లలో చేస్తుండడంతో కొందరు మాత్రమే పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక గతంలో 2020కి ముందు ఏడాదిలో 400కేసులు నమోదైతే ప్రస్తుతం ఈసంఖ్య 600లకు పెరిగింది. రోజువారీ ఫిర్యాదుల సంఖ్య గతంలో మూడు నాలుగు ఉంటే ప్రస్తుతం ఈసంఖ్య పది దాటింది. దీంతో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2021-22 సంవత్సరంలోనే గజ్వేల్ రూరల్ స్టేషన్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ ఈ ప్రతిపాదనలపై ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు పడలేదు. గజ్వేల్ రూరల్ స్టేషన్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లిలను కలుపుతూ గజ్వేల్ రూరల్ సర్కిల్, గజ్వేల్ పట్టణాన్ని ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా ప్రత్యేకంగా టౌన్‌కు పరిమితం చేయడంతో పాటు తొగుట సర్కిల్ పరిధిలో బేగంపేట, రాయపోల్, తొగుట, దౌల్తాబాద్‌లను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలు అక్కడికే పరిమితమయ్యాయి. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సర్కిళ్ల పునర్విభజన, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విభజనకు అడ్డంకిగా కొందరు

గత ప్రభుత్వంలో అన్ని తామై వ్యవహరించినట్లుగా భావించిన పలువురు నాయకులు మండల విభజనకు అడ్డంకిగా మారారు. గజ్వేల్ మండలంలోనే ఉంటామని, గజ్వేల్ అనే పేరు ఉండాలన్న లక్ష్యంతో పలువురు మండల విభజనను వ్యతిరేకించారు. తమ పరిధిలోని గ్రామాలను విడదీయవద్దని పలువురు సర్పంచ్‌లు, స్థానికంగా ప్రభావితం చేయగలిగే నాయకులకు హుకుం జారీ చేయడంతోనే విభజనకు గ్రీన్‌సిగ్నల్ పడలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని, మండలాన్ని విభజన చేస్తే అటు ప్రజలకు పౌరసేవలు, ఇటు అధికారులకు పని ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయి.

పెరిగిన ట్రాఫిక్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన తొగుట మండలంలోని రాంపూర్, లక్ష్మాపూర్, వేములఘాట్, బ్రాహ్మణబంజేరుపల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు వచ్చి చేరాయి. ఇక కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలైన బైలంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు కొండపోచమ్మ సాగర్ పునరావాస కాలనీకి వెళ్లకుండా పిల్లల చదువు, గజ్వేల్‌లో వ్యాపారం, ఉద్యోగాలు ఉన్న పలువురు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గజ్వేల్ పట్టణంలో జనాభా భారీగా పెరిగింది. గతంలో 40వేల జనాభా ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 80 నుంచి 90 వేలకు చేరింది. దీంతో మండల పునర్విభజనతో పాటు పోలీసు శాఖ, ఇతర శాఖలను పునర్వవస్థీకరించాలని పలువురు కోరుతున్నారు.

భక్తిపారవశ్యం

శివ్వంపేట, జనవరి 28: మండలంలోని చిన్నగొట్టిముక్లలో ఎనిమిదేళ్ల తర్వాత మూడురోజుల పాటు నిర్వహిస్తున్న గ్రామదేవతల ఉత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. లింగమయ్యకు, దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, బోనాల ఊరేగింపును నిర్వహించారు. ఆకట్టుకుంది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డితో పాటు ఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, సర్పంచ్ బాలమణినరేందర్ తదితరులు పాల్గొన్నారు. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఒడిబియ్యం, బోనాలు సమర్పించారు.



చిన్నగొట్టిముక్ల గ్రామదేవతల ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

గంగయ్యపల్లిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

శివ్వంపేట మండలంలోపి గంగయ్యపల్లిలోని ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా వేదాంతహారతి, ఖురాన్, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా భక్తులు హాజరయ్యారు. నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలాపూర్‌లో ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

పటాన్‌చెరు, జనవరి 28: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో రేణుక ఎల్లమ్మ జాతరను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని భ్రమరాంబామల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మల ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. అమ్మవారికి గ్రామ మహిళలు బోనాలను సమర్పించారు. జాతర పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ ఈర్లదేవానంద్, సర్పంచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ బ్రహ్మోత్సవాలు

రామాయంపేట, జనవరి 28 : ఆలయ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని చిత్తారమ్మ బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు దర్శించుకున్నారు. ఆమె వెంట నాయకులు సరాపు యాదగిరి, చంద్రం, పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ నాగరాజు ఉన్నారు.

అయోధ్య గుడి అద్భుతంగా ఉంది

రేగోడు జనవరి 28: అయోధ్యలోని రాముడి మందిరం అద్భుతంగా నిర్మించారని నారాయణఖేడ్ మండలం కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ అన్నారు. ఆదివారం రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న హనుమాన్ మందిరాన్ని ఆయన పరిశీలించారు. నిర్మాణంకు పలు సూచనలు చేశారు.

నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్, జనవరి 28: నర్సాపూర్ పట్టణంలోని ఆరాధ్యదైవం నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ నుంచి మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎంపీపీ రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, ప్రతినిధులు దండుదశరత్, జగదీష్ శ్రీశైలంయాదవ్, కొండికుమార్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో
గుమ్మడిదల విద్యార్థి ఎగ్జిబిట్ ప్రదర్శన



ఫైజాన్ రూపొందించిన క్రాప్ ప్రొటెక్టర్

సంగారెడ్డి అర్బన్, జనవరి 28 : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్‌కె. ఫైజాన్ రూపొందించిన ఓ సైన్స్ ప్రయోగాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించే అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ఇనిషియేటివ్ ఫర్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఎస్‌టీఈఎం(ఐఆర్ఐఎస్) కార్యక్రమంలో వినూత్నంగా తయారు చేసిన 'క్రాప్ ప్రొటెక్టర్'పై చేసిన అభివృద్ధి ప్రయోగాన్ని ప్రదర్శించేందుకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వంద మంది రూపొందించిన ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక కాగా, అందులో గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఫైజాన్ రూపొందించిన ప్రయోగం ఉండడం విశేషం. ఈ ఆవిష్కరణకు గుర్తింపు దక్కితే అమెరికాలో జరిగే ఎగ్జిబిట్ల ప్రదర్శనకు ఎంపిక చేస్తారు.

పొలంలో నాన్న పడే కష్టం చూడలేక..

తన తండ్రి పొలంలో పడుతున్న కష్టాన్ని చూడలేక తాను 'క్రాప్ ప్రొటెక్టర్'తో పరిష్కారం చూపాలని దీనిని రూపొందించినట్లు విద్యార్థి ఫైజాన్ తెలిపారు. చిన్న వాటర్ బాటిల్‌తో బెల్ మోగించడం ద్వారా పక్షులను పారదోలేలా చేసిన ప్రయోగం జాతీయ స్థాయిలో ఎంపికైందని పేర్కొన్నారు. రైతు పొలంలో లేకున్నా పక్షులు, జంతువులు వచ్చినప్పుడు దానంతట అదే శబ్దం చేస్తుందని, అడవి పందులు, కోతులు, పక్షులు పొలంలోకి వచ్చే అవకాశం ఉండదని వివరించారు. సోలార్‌తో ఇది పనిచేస్తుందని, ఎలాంటి హాని ఉండదని తెలిపారు. గైడ్ టీచర్ శోభారాణితో కలిసి రూపొందించిన ఈ ఆవిష్కరణ గతేడాది నాగపూర్‌లో జరిగిన చిల్డ్రన్స్ కాంగ్రెస్, భువనేశ్వర్‌లోని జీ-20 సైన్స్ ఫెయిర్, గౌహతిలోని రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శినలో ప్రదర్శించారు.

నెహ్రూ యువకేంద్ర జిల్లా అడ్వైజరీ

బోర్డు మెంబర్‌గా మండల పరమేశ్



తొగుట, జనవరి 28: నెహ్రూ యువకేంద్ర సంఘటన్ సిద్దిపేట జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా తొగుట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మండల పరమేశ్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనురాగ్ ఠాగూర్, ఎన్‌వైకేఎస్ డైరక్టర్ ఆఫ్ జనరల్ ఇండియా నితీశ్‌కుమార్ మిశ్రా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల పరమేశ్ విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేంద్ర ప్రభుత్వం జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా నా వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

పట్టణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టాలి

మిరుదొడ్డి,జనవరి28: పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రితో మాట్లాడుతూ.. పటణాల్లోని ఇళ్లలో పాచిపని చేసేవారిని అసంఘటిత కార్మికులుగా గుర్తించి, ప్రమాదబీమాను కల్పించాలని కోరారు.



మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

మగ్దూంపూర్ పాఠశాలపై వివక్ష ఎందుకు?

- కనీస వసతులు కరువు
- అభివృద్ధి కోసం నిధుల మంజూరును విస్మరించిన అధికారులు
- అర్ధాంతరంగా ఆగిన ప్రహరీ పనులు
- రక్షణ లేక మందుబాబులకు అడ్డాగా మారిన వైనం





మగ్దూంపూర్ ఉన్నత పాఠశాల, ప్రహరీ లేక నల్లాలను ధ్వంసం చేసిన మందుబాబులు

నంగునూరు, జనవరి 28: మన ఊరు మనబడి ద్వారా జిల్లాలోని వివిధ పాఠశాలలను అభివృద్ధి పరిచిన ప్రభుత్వం మండలంలోని మగ్దుంపూర్ పాఠశాలను ఎందుకు విస్మరించారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలం మగ్దుంపూర్, రాంపూర్ గ్రామాల శివారులో రెండు గ్రామాల విద్యార్థుల సౌకర్యార్థం 2006లో మగ్దుంపూర్ గ్రామ సర్పంచు మయోజు చక్రపాణి సుమారు 2 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పాఠశాలకు అప్పగించారు. ప్రభుత్వం పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయడంతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ప్రహరీ లేకపోయినా ఆవరణలో పాఠశాల సిబ్బంది సమష్టి కృషితో చెట్లను పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు. అయితే ప్రహరీని నిర్మించక పోవడంతో బడి లేని సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. 2016 జనవరి 25వ తేదీన అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రహరీనిర్మాణానికి శంకుస్థాపన చేసి 2017లో రాష్ట్ర ఆర్థిక సంస్థ నిధుల నుంచి రూ.10లక్షల నిధులను విడుదల చేయించారు. ఆ నిధులతో సగం గోడను మాత్రమే నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ప్రహరీ పూర్తి చేసి గేటు ఏర్పాటు చేయకపోవడంతో పాఠశాల ఆవరణలో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.

మందుబాబుల ఆగడాలు

పాఠశాల ఊరికి దూరంగా ఉండి ఎలాంటి సెక్యూరిటీ లేకపోవడంతో పాటు ప్రహరీ లేకపోవడం మందుబాబుల పాలిట వరంగా మారింది. బడి వదిలిన తరువాత పాఠశాలలో ఎవరు లేని సమయంలో మద్యంప్రియులు ఆవరణలోకి వెళ్లి మద్యం తాగి, సీసాలు పగులగొట్టిపోతున్నారు. మద్యం మత్తులో ఆవరణలోని మూత్రశాలలు, మరుగుదొడ్ల బేసిన్లు పగులగొడుతున్నారు. తాగు నీటి నల్లాలను ధ్వంసం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే పాఠశాల ఆవరణంలో నిర్మించిన వంటగది చిన్నదిగా ఉండడంతో వర్షాలు వచ్చినప్పుడు మధ్యాహ్న భోజన నిర్వహణకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మన ఊరు మనబడి పథకం కింద ఇతర పాఠశాలలకు నిధులు మంజూరైనప్పటికీ మగ్దుంపూర్ స్కూలుకు నిధులు కేటాయించకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు, నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని తీసుకుని ప్రహరీని పూర్తిచేసి పాఠశాలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

హుస్నాబాద్‌లో విద్యుదాఘాతంతో బాలుడి మృతి





బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, సయ్యద్ సాదిక్ అన్వర్(ఫైల్)

హుస్నాబాద్, జనవరి 28: ఇంటి డాబాపై ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని బస్‌డిపో వెనుక కాలనీలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ షంశీర్‌కు కుమారుడు సయ్యద్ సాదిక్ అన్వర్ (6), కుమార్తె సంతానం. ఆదివారం సాయంత్రం సాదిక్ అన్వర్ ఇంటి డాబాపై ఇనుప టేపుతో ఆడుకుంటుండగా పక్క నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ ఎర్రల కిరణ్, వార్డు కౌన్సిలర్ చిత్తారి పద్మ పరిశీలించారు.

బంగ్లా వెంకటాపూర్‌లో రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రాజ్‌కుమార్

గజ్వేల్ రూరల్, జనవరి 28. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లో గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం సిండేషా జిల్లాలోని గిర్ధ ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్(24) బతుకుదెరువు కోసం గజ్వేల్ ప్రాంతానికి వచ్చాడు. మండలంలో జరుగుతున్న కాళేశ్వరం సొరంగం, టన్నెల్‌లో పనులు చేస్తున్న కార్మికులకు ఏడాది కాలంగా వంటలు చేసి పెడుతున్నాడు. ఉదయం కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా, ప్రమాదవశాత్తు సిద్దిపేట్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న రైలు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు ఎంపీటీసీలకు ప్రత్యేక సమావేశం

మద్దూరు, జనవరి 28 : నేడు ఎంపీటీసీలకు మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలందరు తప్పక హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 15 ఫైనాన్స్ నిధులను గ్రామాలవారీగా కేటాయించనున్నట్టు తెలిపారు.

వాసవీక్లబ్ నూతన కార్యవర్గం



వాసవీక్లబ్ నూతన కమిటీ సభ్యులు

కొండపాక, జనవరి 28 : ఉమ్మడి కొండపాక మండలం వాసవీక్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటయ్యింది. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. కొండపాక మండల వాసవీక్లబ్ అధ్యక్షుడిగా ఉప్పల రాజు, సెక్రెటరీ వేముల శివప్రసాద్, ట్రెజరర్ కాపర్తి రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంప శ్రీనివాస్, వాసవీక్లబ్ గవర్నర్ భానూరి నరసింహులు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాసం నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఉప్పల పాండురంగం, వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మంకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన న్యాయవాది



సీఎంను సన్మానిస్తున్న టీఎస్ఎస్ఎఫ్ జాతీయ నాయకుడు రమేష్

సిద్దిపేటటౌన్, జనవరి 28: సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిద్దిపేటకు చెందిన న్యాయవాది, టీఎస్ఎస్ఎఫ్ జాతీయ సమన్వయ కమిటీ సభ్యుడు తాటికొండ రమేష్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మిరుదొడ్డి, జనవరి 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో హమాలీ కార్మికుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న హమాలీకార్మికుల వ్యతిరేక చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐటీయూ స్థానిక మండల అధ్యక్షుడిగా కుమ్మరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రాసి రెడ్డి, ఎల్లం, స్వామి, ప్రధాన కార్యదర్శి ఎల్లం, సహాయ కార్యదర్శులుగా కూతురు స్వామి, బాల్‌రాజు, చెక్కస్వామి, కోశాధికారిగా రాజులతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.



హమాలీ కార్మికులతో మాట్లాడుతున్న గోపాలస్వామి

అసిస్టెంట్ యోగా టీచర్లకు సర్టిఫికెట్ల ప్రదానం



ఎన్‌జీవో భవన్‌లో యోగా టీచర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు రంగాచారి

సిద్దిపేట టౌన్, జనవరి 28: ఆరోగ్య పరిరక్షణకు యోగా కీలకమని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతంజలి యోగా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంగాచారి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతంజలి యోగా ఆధ్వర్యంలో అసిస్టెంట్ యోగా టీచర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న కాసోజు శ్రీనివాస్, గొపిశెట్టి భిక్షపతి, దేవేందర్‌గౌడ్, ఎలిగేటి కృష్ణమూర్తి, బొజ్జ అశోక్, రాజూరి నగేష్‌కు రంగాచారి, యువ భారత్ జిల్లా అధ్యక్షుడు పెద్ది మనోహర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మనిషి ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని కొనసాగించే అవకాశం ఉంటుదన్నారు. ప్రతీ ఒక్కరికి వ్యాయామం, యోగా చేరువ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మల్లేశం, పుదిల్ల శ్రీను, శ్రీహరి, కనకరాజు, జూలూరి రవి తదితరులు పాల్గొన్నారు.

సద్గురుభవన్‌లో మహాన్యాసక పూర్వక శత రుద్రాభిషేకం



మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న మహిళలు

చేర్యాల, జనవరి 28: చేర్యాల పట్టణ శివారులోని సద్గురుభవన్‌లో జగద్గురు ఆదిశంకరాచార్య ప్రతిష్ఠాంగ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శివుడు, ఆది శంకరాచార్యులకు విశేష ఫల రసాభిషేకం నిర్వహించారు. రకరకాల పూలతో అలంకరించారు. అనంతరం రుద్రహోమం జరిపారు. కాగా శనివారం రాత్రి అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఆదిశంకర దర్బార్ వరకు ఆది శంకరాచార్య శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు సదనం నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి శ్రేయస్సుకన్నా సమాజ శ్రేయస్సు మిన్న



ఆర్ఎస్ఎస్ విభాగ ప్రముఖ్ మురళీధర్‌ను సత్కరిస్తున్న క్షేత్ర నిర్వాహకులు

కొండపాక, జనవరి 28: వ్యక్తి శ్రేయస్సు కన్నా సమాజ శ్రేయస్సు ఎంతో ఉన్నతమైనదని విజయదుర్గా ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ పరివార క్షేత్రాల కుటుంబసమ్మేళనం జరిగింది. కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు ఆసక్తి పెంచుకుంటున్న తరుణంలో సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన కుటుంబ జీవన వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విభాగ్ సంఘచాలక్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ సమ్మేళనాల వల్ల మానవీయ విలువలు ద్విగుణీకృతం అవుతాయన్నారు.

భారతీయ సాంస్కృతిక పరిమళాలను భావితరాలకు అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవాహ ప్రవీణ్ రాఘవులు, బాలరాజేశం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పుల్లూరు లక్ష్మీనృసింహస్వామి

దేవస్థానం చైర్మన్‌గా కనకయ్యగౌడ్



కనకయ్యగౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, జనవరి 28: పుల్లూర్ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా పుల్లూర్ కనకయ్యగౌడ్‌ను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట పట్టణంలో పుల్లూర్ కనకయ్యగౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. దేవస్థానం చైర్మన్‌గా పుల్లూర్ కనకయ్యగౌడ్‌తో పాటు డైరెక్టర్లుగా, ఒగ్గు యాదగిరి, ఐరేని దేవిరెడ్డి, బెస్త రాములు, గొడుగు రవి, పెద్ద కర్రే కిష్టయ్య, వడాల కనకయ్యలను నియమించింది. దేవస్థానం చైర్మన్ పుల్లూర్ కనకయ్యగౌడ్ మాట్లాడుతూ పుల్లూర్ నృసింహస్వామి దేవస్థానం ఉత్సవకమిటీ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పూజల హరికృష్ణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పుల్లూర్ దేవస్థానంలో ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు జరిగే జాతరకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, దేవస్థానం అభివృద్ధికి కూడా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కుమ్మరి రాములు, అంజిరెడ్డి, గుర్రం అంజిరెడ్డి, రాజ్ బహదూర్‌రెడ్డి, వహబ్, అజ్మత్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, ఐరేని రాజిరెడ్డి, గొడుగు శీను, శివప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మద్దూరు, జనవరి 28 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ మాజీ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ సూచించారు. ఆదివారం మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహస్వామి ప్రమాద బీమాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్టీల కతీతంగా అందరికి అందేలా చూడాలని తెలిపారు. కేవలం ఏడాది సభ్యత్వ రుసుం రూ.150లు కడితే రూ 5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో సత్తాచాటిన 'గోల్డ్‌స్టోన్' విద్యార్థులు



పోటీల్లో సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

ములుగు, జనవరి 28: గోల్డ్‌స్టోన్ స్కూలు విద్యార్థులు పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందని స్కూల్ చైర్మన్ సావిత్రి సింగ్ పేర్కొన్నారు. ఇటీవల ముంబైలోని నిర్వహించిన డ్రాయింగ్ కాంపిటీషన్‌లో మండలంలోని తునికి బొల్లారం గ్రామానికి గోల్డ్ స్టోన్ స్కూల్ విద్యార్థులు 300మంది డ్రాయింగ్ కాంపిటీషన్ పాల్గొన్నారు. అందులో రంగోత్సవ్ సెలెబ్రేషన్స్ ముంబాయిలో జరిగిన డ్రాయింగ్ కాంపిటీషన్‌లో గోల్డ్ స్టోన్ హైస్కూల్‌కు చెందిన 60మంది విద్యార్థులు ట్రోఫీ, గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. స్కూల్ చైర్మన్ సావిత్రి సింగ్, డైరెక్టర్స్ బలవంత్ సింగ్, జస్వంత్ సింగ్, ప్రదీప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సంగమేశ్వర్, తదితరులు ఆదివారం విద్యార్థులతో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ ప్రకాష్‌ని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీకి గజ్వేల్ విద్యార్థుల ఎంపిక





జాతీయ స్థాయికి ఎంపికైన మాధవి, లారేన్



శివకుమార్, రాష్ట్ర బాలుర టీం మేనేజర్

గజ్వేల్, జనవరి 28: ఇటీవల గజ్వేల్ పట్టణంలోని నిర్వహించిన 49వ జూనియర్ ఛాంపియన్ షిప్ కబడ్డీ పోటీల్లో సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు నుంచి జాతీయ జూనియర్ ఛాంపియన్ షిప్-2024 పోటీలకు తెలంగాణ జట్టులో ఇద్దరికి స్థానం దక్కింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాధవి(రైట్ కవర్), బాలుర విభాగంలో లారేన్(రైడర్)గా ఎంపికయ్యారు. బాచుపల్లిలో ఫిబ్రవరి 1 నుంచి 4వరకు కాసాని కౌసల్య మెమోరియల్ 49వ జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఎంపికపై జిల్లా అధ్యక్షుడు ఎస్‌సీ సంతోష్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. కాగా తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్‌గా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్‌ను ఎంపిక చేశారు.

గ్రామ కమిటీలతోనే కాంగ్రెస్ బలోపేతం

మద్దూరు, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మద్దూరు ఉమ్మడి మండల యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ తెలిపారు. ఆదివారం దూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో ఏక గ్రీవంగా గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా పాకాల హరిభూషణ్, ఉపాధ్యక్షుడిగా బండి కమలాకర్, కార్యదర్శులుగా పారుపల్లి బాలరాజ్, గొనెపల్లి వేణు, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, రాజు, రాజు, ఆఫ్సర్, రాకేష్, గ్రామ యూత్ అధ్యక్షుడిగా శ్రీరాముల ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా దాసారం రాజు, కార్యదర్శిగా సిరిమల్ల భరత్, కార్యవర్గ సభ్యులుగా రాజు, బాలరాజ్, రాజు ఎన్నికయ్యారు.

బాలవికాస సామాజిక సేవలు మరువలేనివి

హుస్నాబాద్, జనవరి 28: బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సామాజిక సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో బాలవికాస ఆధ్వర్యంలో వితంతువులకు చీరలు, వికలాంగులకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ బాల వికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలక్క లండన్‌లో స్థిరపడినప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, బంక చందు, వెన్న రాజు, మాడిశెట్టి శ్రీధర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్ తదితరులు

కొండపాక, జనవరి 28: మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తొగుట మార్కెట్‌కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్ శనివారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు సుమారు 150 మంది కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే 6 గ్యారంటీల పథకాలతో పేద బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు.

మాల మహానాడు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 28: మాల మహానాడు ఆఫ్ ఇండియాకు చెందిన నూతన క్యాలెండర్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం సిద్దిపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు మద్దెల నర్సింహులు, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తిమృతి



స్వామి (ఫైల్)

తొగుట, జనవరి 28: బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపూర్‌లో శనివారం రాత్రి జరిగింది. తొగుట పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం... రాంపూర్ గ్రామానికి చెందిన అప్పనపల్లి స్వామి(48) రాత్రి సమయంలో వాగుగడ్డ నుంచి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ బయలుదేరాడు. అదే సమయంలో బ్రాహ్మణ బంజర్‌పల్లి గ్రామం (ప్రస్తుత ఆర్‌అండ్ ఆర్ కాలనీ)కి చెందిన ఆకుల శ్రీకాంత్ తొగుట నుంచి గజ్వేల్ వైపు బైక్‌పై వెళ్తూ స్వామిని ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్వామికి ఛాతి, కడుపులో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, కూతురు మానస(24), కొడుకు నాగరాజు(12) ఉన్నారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి బలవన్మరణం



రవికుమార్ (ఫైల్)

ములుగు, జనవరి 28: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సింగన్నగూడలో చోటు చేసుకున్నది. ములుగు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉత్తరప్రదేశ్ జిల్లాకు చెందిన అజంగార్ జిల్లా గ్రామం షేక్‌పూర్ జోచోలి రాంపూర్ గ్రామానికి చెందిన రవికుమార్(27) రెండేళ్ల క్రితం నుంచి ములుగు మండలం సింగన్నగూడ గ్రామంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతడు ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. శనివారం రాత్రి పని ముగించుకుని రూమ్‌కు వచ్చిన రవికుమార్ ఉదయం 7.30 గంటల సమయంలో కడుపు నొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టు మార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



అంజయ్య(ఫైల్)

మిరుదొడ్డి, జనవరి 28: పొలంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరిగిపడటంతో తీవ్ర గాయాలపాలైన రైతు చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన రైతు సిద్రమైన అంజయ్య(48) ఈ నెల 23వ తేదీన పొలంలో పని చేస్తుండగా మునగ చెట్టు విరిగి అతడిపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం సిద్దిపేటకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి అంజయ్యను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్టు తెలిపారు.

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

బెజ్జంకి, జనవరి 28: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని ముత్తన్నపేట గ్రామశివారులో ఆదివారం జరిగింది. బాధితుడు కర్రె శశిధర్ ముత్తన్నపేట గ్రామ శివారులో గొర్రెల పెంపకం షెడ్డును నిర్వహిస్తున్నాడు. గొర్రెల కాపరులు గొర్రెలను షెడ్డులో తోలి ఇంటికి వెళ్లిన సమయంలో వీధి కుక్కలు గొర్రెల షెడ్డులోకి దూరి మూకుమ్మడిగా దాడి చేయడంతో 28 గొర్రెలు మృతి చెందాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వపరంగా ఆదుకొని నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

గ్రామాలాభివృద్ధిలో సర్పంచుల పాత్ర గొప్పది



సర్పంచులు, ఉప సర్పంచులను సన్మానిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ తదితరులు

గజ్వేల్, జనవరి 28: గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర గొప్పదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం గజ్వేల్ నియోజకవర్గ సర్పంచులు, ఉప సర్పంచులకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సర్పంచ్‌లదేనన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి పనిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50రోజులు గడిచినా ఆరుగ్యారంటీల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు.